# కక్షపూరితంగానే ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు

- హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం తప్పా
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు స్వామిదాస్

కలెక్టరేట్, డిసెంబర్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ఈక్రమంలోనే టీఎస్ ఎంఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను గురువారం ప్రభుత్వం అరెస్టు చేసి, అనంతరం బెయిల్‌పై విడుదల చేసిందని ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు స్వామిదాస్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అటకెక్కిస్తే వాటిని గుర్తు చేయడం ప్రతిపక్ష పార్టీల నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు. దానిని వారు పాటిస్తే ప్రభుత్వానికి కంటగింపుగా మారి, ప్రతిపక్ష నాయకులపై ఉక్కుపాదం మోపుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీలు కూడా విస్మరించి, ఏకపక్ష పాలన సాగిస్తుండడం సముచితం కాదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ పాత్ర వెలకట్టలేనిదన్నారు. అనేక సందర్భాల్లో వందల కేసులు నమోదు కాగా, ఉద్యమం కోసం ఎన్ని కేసులైనా తనపై నమోదు చేసుకోవచ్చని చేసిన ప్రకటనను గుర్తు చేశారు. వెంటనే శ్రీనివాస్‌పై పెట్టిన కేసు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫోరం ప్రతినిధులు వెంకటస్వామి, మనోహర్, బానోతు హరిలాల్, వెంకటేశ్వర్లు, మాదరి మహేశ్‌కుమార్, రవీందర్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల కోసం గాంధీ విగ్రహానికి వినతి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ సర్పంచులు

చిగురుమామిడి, డిసెంబర్ 27: గ్రామాల అభివృద్ధి పనులకు సంబంధించి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేసేలా చూడాలని మండల కేంద్రంలో శుక్రవారం మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జక్కుల రవీందర్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వక ఇబ్బందులకు గురి చేస్తున్నదని, తెచ్చిన అప్పులు తీర్చలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. బిల్లులు చెల్లించకపోతే పంచాయతీలకు తాళం వేస్తామని హెచ్చరించారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జక్కుల రవీందర్, మాజీ సర్పంచులు సన్నిల్ల వెంకటేశం, గోలి బాపురెడ్డి, నాగేల్లి వకుల, బెజ్జంకి లక్ష్మణ్, ముప్పిడి నరసింహారెడ్డి, చెప్యాల మమత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

PLOT FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## 29న స్పోర్ట్స్ మీట్

వీణవంక, డిసెంబర్ 27: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఈ నెల 29న నెహ్రూ యువకేంద్రం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు యూత్ అధ్యక్షుడు కర్రె నాని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షెటిల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ పోటీలో విజేతలకు రూ.4 వేల క్రీడా సామగ్రిని, రన్నరప్‌కు ట్రోఫీ, మెడల్స్ అందిస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన వారి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, ఆసక్తి గల యువజన సంఘాలు, క్రీడాకారులు 9989139012, 8374356349, 8179064485 నంబర్లలో సంప్రదించాలని యూత్ అధ్యక్షుడు కర్రె నాని కోరారు.

## రోడ్డు ప్రమాదానికి కారణమైన ఒకరిపై కేసు

గన్నేరువరం, డిసెంబర్ 27: ద్విచక్ర వాహనదారుడిని కారుతో ఢీకొట్టిన ప్రమాదంలో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ కిషన్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మాజీపల్లి గ్రామానికి చెందిన సొల్లు మల్లేశం, భార్య తార, అలాగే సొల్లు రమేశ్ అనే వ్యక్తి రెండు ద్విచక్ర వాహనాలపై గురువారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వర్కోలు గ్రామంలో శుభకార్యానికి బయలు దేరారు. ఈ క్రమంలో గుండ్లపల్లి చెరువు కట్ట మూలమలుపు వద్ద సొల్లు మల్లేశం, తార ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో మల్లేశం తలకు తీవ్ర గాయాలు కాగా, తారకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై సొల్లు రమేశ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ బూరి రాజకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. మల్లేశం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

## ఖబ్రస్థాన్ స్థలం కబ్జాపై ఫిర్యాదు

శంకరపట్నం, డిసెంబర్ 27: ఎంతో కాలంగా తమ ఆదీనంలో ఉన్న ఖబ్రస్థాన్ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ముత్తారం గ్రామానికి చెందిన ముస్లింలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు ముస్లింలు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 179/2లో గల 12 గుంటల ప్రభుత్వ భూమిని గతంలో రెవెన్యూ అధికారులు తమకు ఖబ్రస్థాన్‌కు కేటాయించారని తెలిపారు. ఎంతో కాలంగా ఆ స్థలంలోనే ముస్లింలు మరణిస్తే ఖననం చేస్తున్నట్లు చెప్పారు. అయితే ఇటీవల అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్కడ ఉన్న సమాధులను ట్రాక్టర్‌తో ధ్వంసం చేసి దున్ని స్థలాన్ని ఆక్రమించినట్లు ఆరోపించారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుని తమకు కేటాయించిన స్థలాన్ని తిరిగి అప్పగించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రూ. 1,236 కోట్ల మద్యం తాగేశారు



మద్యం కొనుగోలు చేస్తున్న ప్రజలు

- ఏడాదిలో రికార్డు స్థాయిలో జిల్లాలో మద్యం అమ్మకాలు
- టాప్‌లో కరీంనగర్ అర్బన్

*పిట్ట కొంచెం కూత ఘనం అటుంటుంటారు.. సరిగ్గా ఆ సామెతకు సరిపోయేలా రాష్ట్రంలోని చిన్న జిల్లా అయినటువంటి కరీంనగర్‌లో మద్యం అమ్మకాలు భారీగా రికార్డు స్థాయిలో జరిగాయి. కొత్త టెండర్ల ద్వారా లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు చేజిక్కించుకున్న వ్యాపారులు, 1 డిసెంబర్ 2023 నుంచి డిసెంబర్ 23 2024 వరకు భారీగా మద్యం అమ్మకాలు జరిపినట్లు ఎక్సైజ్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.*

**-రాంనగర్, డిసెంబర్ 27**

జిల్లాలోని ఐదు సర్కిల్స్ కరీంనగర్‌అర్బన్, రూరల్, తిమ్మాపూర్, హుజూరాబాద్, జమ్మికుంటలో ఆబ్కారీ శాఖ కార్యాలయాలు ఉండగా, వాటి పరిధిలో క్లబ్బులు, బార్లు, మద్యం దుకాణాలు మొత్తం 127 ఉన్నాయి. మద్యం అమ్మకాల్లో జిల్లాలో కరీంనగర్ అర్బన్ రూ.400 కోట్లతో టాప్‌లో నిలువగా, చివరి స్థానంలో రూ.174 కోట్ల మద్యం అమ్మకాలు జరిపి జమ్మికుంట చివరి స్థానంలో నిలిచింది.

**మద్యం అమ్మకాల వివరాలు**

జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఏటా అమ్మకాలు పెరుగుతూ వస్తున్నాయి. అందులో కరీంనగర్ అర్బన్‌లో బార్స్, క్లబ్స్, వైన్స్‌లు 43 ఉండగా, రూ.400 కోట్ల పైచిలుకు మద్యం అమ్మకాలు జరిగాయి. అలాగే, కరీంనగర్ రూరల్‌లో 29 మద్యం దుకాణాలు ఉండగా, రూ.306 కోట్ల పైచిలుకు, జమ్మికుంట 19 మద్యం దుకాణాల్లో రూ.174 కోట్ల పైచిలుకు, తిమ్మాపూర్‌లో 15 షాప్స్ ఉండగా రూ.176 కోట్ల పైచిలుకు, హుజూరాబాద్‌లో 21 షాప్స్ ఉండగా అందులో రూ.179 కోట్ల పైచిలుకు మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఇక జిల్లా వ్యాప్తంగా చూసినట్లయితే రూ.1,236 కోట్ల పైచిలుకు మద్యం అమ్మకాలు జరిపి రికార్డు సృష్టించారనే చెప్పుకోవచ్చు. డిసెంబర్ 31 రాకముందే అత్యధిక మొత్తంలో జిల్లాలో మద్యం అమ్మకాలు జరుగగా, ఇక 31న ఒకే రోజు సుమారు రూ.100 కోట్లకు పైగా అమ్మకాలు జరిగే అవకాశాలున్నాయి. మద్యం దుకాణాల ద్వారానే కాకుండా రూరల్ ప్రాంతాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్కో మద్యం దుకాణం ఏడాది రూ.54 లక్షల చొప్పున ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి ఉండగా, ఇందుకు ఎనిమిది రేట్ల మద్యం అంటే సుమారు రూ.నాలుగున్నర కోట్ల విలువైన మద్యం అమ్ముకోవచ్చు. ఈ పరిమితికి మించితే 14 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో 94 దుకాణాల్లో ఒక్కోచోట రూ.10 కోట్ల పైచిలుకు విక్రయాలు జరుగడం గమనార్హం. ఒక్క కరీంనగర్ జిల్లా నుంచే మద్యం అమ్మకాల ద్వారా ఇప్పటికే ప్రభుత్వానికి రూ.1,236 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరడం విశేషం. అయితే ఇక రాష్ట్రంలో ఉన్న 32 జిల్లాల నుంచి ఎంత ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరే అవకాశం ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



నగరంలో సంతాపం తెలుపుతున్న పీఎస్‌ఆర్ వాకర్స్

తిమ్మాపూర్/కలెక్టరేట్/విద్యానగర్/జమ్మికుంట/తిమ్మాపూర్/శంకరపట్నం/గంగాధర/చొప్పదండి, డిసెంబర్ 27: మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ మృతికి జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీలోని మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, దేశ ఆర్థిక ప్రగతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. నగరంలోని కిసాన్‌నగర్‌లో గల రైతు సంఘాల సమాఖ్య జిల్లా కార్యాలయంలో మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జాతీయ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పి.రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో రైతు సంఘాల సమాఖ్య ప్రతినిధులు పి. కేశవరెడ్డి, మల్లికార్జున్, రఘుపతిరెడ్డి, తాడ బుచ్చిరెడ్డి, తాండ్రియాల మదన్‌మోహన్‌రావు, తిరుపతి రావు, మల్లేశం, ఆగంరావు పాల్గొన్నారు. పీఎస్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి, మన్మోహన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఇక్కడ అధ్యక్షుడు హనుమాన్ల రఘుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండ రవీందర్, ఉపాధ్యక్షులు కర్ర సత్యనారాయణ రెడ్డి, పాలోజు రవీందర్, మిరియాల శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి ఐల రామ్మోహన్, కార్యదర్శులు బుస్సా శ్రీనివాస్, చంద్రశేఖర్, రవి, సలహాదారులు పోరెడ్డి నరేందర్ రెడ్డి, సందూరి భూమ్‌రెడ్డి, పిట్టల నరసయ్య, దాసరి దశరథం ఉన్నారు. జమ్మికుంట పట్టణంలో తెలంగాణ చౌక్ వద్ద, శంకరపట్నం మండల కేంద్రంలో, చొప్పదండిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. గంగాధర సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ దూలం బాలాగౌడ్ మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ వైస్ చైర్మన్ వేముల భాస్కర్, డైరెక్టర్లు ఆకుల అంజయ్య, బెజ్జంకి కళ్యాణ్, పొన్నం రాములు, కోల మల్లయ్య, కార్యదర్శి గాలిపెల్లి రమేశ్, సిబ్బంది శేఖర్‌రెడ్డి, సతీశ్, శ్రీనివాస్, కనకయ్య, పద్మ ఉన్నారు.

# సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి జనార్దన్ రెడ్డి

- 30 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు హాజరు

కొత్తపల్లి, డిసెంబర్ 27: చీఫ్ మినిస్టర్స్ కప్-2024 రాష్ట్రస్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్, మేనేజర్, రెఫరీలు హాజరయ్యారు. పోటీలకు హాజరైన క్రీడాకారుల ఆయా వెయిట్ కేటగిరీలకు సంబంధించి సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు పరిశీలించారు. తొలి రోజు బాలుర విభాగంలో 35, 40, 60, 66 కేజీల్లోపు, బాలికల విభాగంలో 40, 44, 63, 70 కేజీల్లోపు కేటగిరీల్లో పోటీలు జరిగాయి. అంతకుముందు ఈ పోటీలను రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి జనార్దన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో జూడో క్రీడకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా నిలుస్తున్నదన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, సెపక్ తక్రా, వెంకట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప వెంకట్, జిమ్నాస్టిక్స్ సంఘాల అధ్యక్షులు కన్న కృష్ణ, డీ నిరంజనాచారి, కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ సంపత్ రావు, భారత జూడో సంఘం కోశాధికారి కైలాసం యాదవ్, జిల్లా పెటా కార్యదర్శి ఎండీ యూనిష్ పాషా, టోర్నమెంట్ ఇన్‌చార్జి ఎన్ రాజు, తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యుడు సిలివేరి మహేందర్, వివిధ జిల్లాల జూడో సంఘం అధ్యక్ష కార్యదర్శులు, రెఫరీలు, కోచ్‌లు, మేనేజర్లు ఎంఏ అజీజ్, టీ సత్యనారాయణ, నాగరాజు, సంతోష్, కిరణ్, సాయిరాం, శ్యామ్, ఎల్వీరమణ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల జాబ్‌మేళాకు స్పందన



కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 348 మంది దివ్యాంగులు మేళాలో పాల్గొనగా, 102 మంది వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించగా, 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, తమ సంస్థల్లో అవసరమైన విధులు నిర్వర్తించేందుకు అర్హులను గుర్తించి, ఎంపిక చేసుకున్నారు. కలెక్టర్ పమేలాసత్పతి జాబ్‌మేళాను సందర్శించి, మేళాకు హాజరైన కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి, ఉద్యోగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా సంక్షేమాధికారి సబిత, యూత్‌ఫర్ జాబ్స్ కోఆర్డినేటర్లు మధుసూదన్, సాహిద్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఉపాధి కల్పనాధికారి తిరుపతి రావు, వారధి మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు, సీడీపీవోలు కస్తూరి, సుగుణ, శ్రీమతి, ఎఫ్‌ఆర్‌వో రఫీ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇల్లందకుంట, డిసెంబర్ 27: మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజేశ్ (40) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్ గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మద్యం తాగొద్దని చెప్పడంతో ఈనెల 25న ఇంట్లో పురుగుల మందు తాగాడు. హనుమకొండలో ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. రాజేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ చెప్పారు.

## ఆమె నేత్రాలు సజీవం



భవాని (ఫైల్)

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 27: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గౌరిశెట్టి భవాని గురువారం గుండె పోటుతో మృతి చెందగా, పుట్టెడు దుఖంలో నేత్రదానానికి అంగీకరించి ఆమె కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. చూపులేని వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చని సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి భవాని కుటుంబ సభ్యులకు వివరించగా, నేత్రదానానికి అంగీకరించారు. ఈ మేరకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల టెక్నీషియన్ రాజేంద్ర ప్రసాద్ సహకారంతో నేత్రాలను సేకరించి, హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు పంపించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రదానం పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఇద్దరికి చూపునందించేందుకు సహకరించిన భవాని భర్త గౌరిశెట్టి శ్రీనివాస్, కూతురు సంయుక్త, వంగల రమేశ్, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, కాసం నగేశ్, రావికంటి రాజేందర్‌ను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ముఖ్య సలహాదారు నూక రమేశ్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, తదితరులున్నారు.

## జమ్మికుంటలో పోలీసుల తనిఖీలు

జమ్మికుంట, డిసెంబర్ 27: హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పట్టణ సీఐ వరంగంటి రవి, సిబ్బంది స్థానిక రైల్వే స్టేషన్, బస్టాండ్, పాన్ షాపులు, రోడ్లు, తదితర ఏరియాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. అనంతరం బస్టాండ్‌లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, అందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. షాపుల్లో నిషేధిత గుట్కా, మసాలా ప్యాకెట్లు క్రయ, విక్రయాలు చేయకూడదని హెచ్చరించారు. రాబోయే కొత్త సంవత్సరం వేడుకలు ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని, రోడ్లపైకి వచ్చి ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని తెలిపారు. వేడుకల సందర్భంగా రోడ్ల మీదకు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరికీ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ వీణవంక ఎస్ఐ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

## మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటు: మాజీ ఎమ్మెల్యే వొడితల

చిగురుమామిడి, డిసెంబర్ 27:ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. దేశ సాంఘిక-ఆర్థిక రంగాల్లో ఆయన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ అత్యంత గౌరవనీయ దౌత్యవేత్తల్లో ఒకరిగా కూడా గుర్తింపు పొందారని, ప్రశాంతమైన మనస్తత్వం, మేధోపరమైన కఠినత్వం ఆయనను అంతర్జాతీయ వేదికపై సమర్థవంతమైన సంధానకర్తగా నిలబెట్టాయని కొనియాడారు. 2004 నుంచి 2014 వరకు దేశ 14వ ప్రధానమంత్రిగా తన పదవీకాలం మొత్తం, విభిన్నమైన సంకీర్ణ ప్రభుత్వాన్ని, వివాదాలకు దూరంగా నిర్వహించారని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేకు పీఆర్టీయూ వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తిమ్మాపూర్, డిసెంబర్27: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించాలని పీఆర్టీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన క్రమంలో హామీ నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేతిరి తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, పులిపాక కిషన్, పల్లెపాటి కిషన్, వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలందించడం అభినందనీయం



గాలిపల్లి వెంకట్‌ను సన్మానిస్తున్న క్లబ్ అధ్యక్షుడు మానువాడ శంకర్

విద్యానగర్, డిసెంబర్ 27: పర్యావరణ పరిరక్షణ, నేత్రదానంతో పాటు క్యాన్సర్ లాంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమాలతో ప్రజలకు సేవలందించడం అభినందనీయమని రీజనల్ చైర్ పర్సన్ గాలిపల్లి వెంకట్ అన్నారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహనను కరీంనగర్‌లోని రేకుర్తిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ అధ్యక్షుడు మానువాడ శంకర్, కార్యదర్శి గిరిధర్‌రావు సన్మానించారు. అనంతరం గాలిపల్లి వెంకట్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ 220 దేశాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నదని, దాని స్ఫూర్తితో ఇక్కడి ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చిలుపూరి రాములు, డైరెక్టర్ మానువాడ వనజ, సభ్యులు గోనె చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సైదాపూర్, డిసెంబర్ 27: రాంచంద్రాపూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని దుద్దనపల్లి గ్రామానికి చెందిన పొన్నం మహేందర్(26) జాగీర్‌పల్లిలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై గురువారం అర్ధరాత్రి హుజూరాబాద్‌కు వెళ్తుండగా రాంచంద్రాపూర్ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలై మృతిచెందాడు. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు.

## నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 27: నగునూర్ గ్రామ పంచాయతీ నర్సరీని శుక్రవారం ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి సంజీవరావు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా సంచుల్లో పెంచుతున్న మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ పంచాయతీకి సంబంధించిన తుప్పు పట్టిన ఇనుప సామగ్రిని పరిశీలించారు. నర్సరీ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, తుప్పు పట్టిన సామగ్రి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కారోబార్ ఫారూఖ్, కంప్యూటర్ ఆపరేటర్ రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేతకు సన్మానం



ఉద్యమకారుడిని సన్మానిస్తున్న సీపీఐ జాతీయ నేత చాడ, బీఆర్‌ఎస్ నేత సర్దార్ రవీందర్ సింగ్

చిగురుమామిడి, డిసెంబర్ 27: తెలంగాణ ఉద్యమంలో విశేష కృషిచేసిన చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గంప సంపత్ కుమార్‌ను హుస్నాబాద్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సర్దార్ రవీందర్ సింగ్ శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో సర్వర్ ఇబ్బందులు



నగునూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సంజీవరావు తదితరులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 27: ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులపై ప్రభుత్వం సర్వే చేపట్టగా, సర్వర్ కారణంగా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల్లోపు, మధ్యాహ్నం 2 గంటల తర్వాత మాత్రమే సర్వర్ పని చేస్తుండడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారుల వివరాల నమోదులో కొంత జాప్యం జరుగుతున్నది. నగునూర్ గ్రామంలో మొత్తం 1,170 దరఖాస్తులు రాగా, 15 రోజుల క్రితం 10 మంది సిబ్బంది కలిసి చేపట్టిన సర్వేలో ఇప్పటి వరకు దాదాపు తొమ్మిది వందల మంది వివరాల నమోదు మాత్రమే పూర్తయింది. ఈ నెల 30లోగా సర్వే పూర్తి చేసి, వివరాలు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి పంపించాలని అధికారులు గడువు నిర్దేశించడంతో పంచాయతీ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. కాగా, నగునూర్ గ్రామంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో సంజీవరావు సర్వేను పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, కారోబార్ ఫారూఖ్, కంప్యూటర్ ఆపరేటర్ రమేశ్, నరహరి నారాయణ, గ్రామ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.